క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు



మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

ఆత్మకూరు: మున్సిపాలిటీలో నాన్ పీహెచ్ వర్కర్స్, ఉద్యోగులకు వేతనం పెరిగిన కారణంగా సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కమిషనర్, కో–ఆప్షన్ మెంబర్‌ను ఆదివారం మర్యాద పూర్వకరంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు వేతనాలు పెరగడంతో పాటు యూనిఫాం ఇచ్చినందుకు సంతోషంగా ఉందని చెప్పారు.

మల్లన్న సేవలో..



మల్లన్న దర్శనం అనంతరం ఆలయం వెలుపల తెలంగాణ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

శ్రీశైలంటెంపుల్: తెలంగాణ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దంపతులు నిండునూరేళ్లు, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి,అమ్మవార్లను కోరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైఫల్యం, ముందు చూపు లేకపోవడంతో తెలంగాణలో యూరియా కొరత ఏర్పడిందని విమర్శించారు. మల్లన్న ఆశీస్సులతో కేసీఆర్ మరోసారి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎంతటివారైనా కేసీఆర్ ముందు బలాదూరేనని కవితపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

విజయవంతం చేయండి

ఆత్మకూరు: పట్టణంలో అక్టోబర్ 11, 12వ తేదీల్లో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం 2వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం కార్యదర్శి రాజశేఖర్, అధ్యక్షుడు రమేష్‌కుమార్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహాసభల్లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గంపై చర్చ నిర్వహిస్తామన్నారు. అంతకముందు ఆహ్వాన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా డా.నాగన్న, అధ్యక్షుడిగా న్యాయవాది గోవిందరెడ్డి, మాజీ ఎంపీపీ ఎల్లాల కృష్ణుడు, ఉపాధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, కార్యదర్శిగా రాజశేఖర్, సహాయ కార్యదర్శులుగా రామేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సుబ్బరాయుడు తదితరులను ఎన్నుకున్నారు.

రైతులు నానో యూరియా వాడాలి

కొత్తపల్లి: రైతులు యూరియా, డీఏపీకి బదులుగా నానో యూరియా, నానో డీఏపీలను వాడాలని మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం సూచించారు. ఆదివారం మండల పరిధిలోని నందికుంట, బావాపురం గ్రామాలలో అవుట్ రిచ్ సర్వేను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. అవసరాన్ని బట్టి ఎప్పటి కప్పుడు యూరియాను మండలానికి తెప్పిస్తామని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పినట్లుగా ఎకరాకు రెండు బస్తాల యూరియా సరిపోతుందని, అంతకు మించి వినియోగిస్తే పంట నష్టపోవడమే కాకుండా భూసారం కూడా దెబ్బతింటుందని రైతులకు వివరించారు.

లోకకళ్యాణం కోసం హోమాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ హౌసింగ్ బోర్డ్ కాలనీలో అమర యోగ వికాస కేంద్రంలో ఆదివారం నిర్వాహకులు యోగానంద ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రహణ సమయం ప్రకృతిలో ప్రత్యేక శక్తులు ఉంటాయని, ఆ శక్తుల మధ్య హోమం చేస్తే ఆరోగ్య దోషాలు తగ్గుతాయని, మనసుకు ప్రశాంతి,ఆత్మబలం పెరుగుతుందని యోగానంద తెలిపారు. గ్రహణం సమయంలో మంత్రాలు, జపాలు, హోమాలు చేయడం వలన సహస్ర గుణిత ఫలితం వస్తుందని స్కాంద పురాణం, మత్స్య పురాణం వంటి గ్రంథాలలో ఉందని తెలిపారు.

ప్రభుత్వ తీరుపై కదం

- రైతుల సమస్యల పరిష్కారం కోసం 'అన్నదాత పోరు'
- 9న ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ముట్టడి
- రైతులు, పార్టీ నాయకులు తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



అన్నదాత పోరుబాట పోస్టర్‌ను విడుదల చేస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విమర్శించారు. రైతాంగ సమస్యలను పరిష్కరించకపోవడంపై ఈ నెల 9వ తేదీన అన్నదాత పోరు విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యూరియా లారీల కోసం రైతులు ఎదురుచూసే దుస్థితి నెలకొందన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌లో రూ.400 నుంచి రూ.450 ప్రకారం అమ్ముతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు.ఒక రైతుకు 2 యూరియా బస్తాలు అని చెబుతున్నప్పటికీ 20 మంది రైతులకు మాత్రమే అందిస్తున్నారన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

తప్పుడు కేసులకు భయపడేది లేదు.. పోలీసులు కార్యకర్తలపై చేయి చేసుకుంటే సహించేది లేదు..ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భరోసానిచ్చారు. పోలీసు అధికారులు ప్రభుత్వానికి కొమ్ము కాయడం తగదన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని దోపిడీ ఇక్కడ ఉందని ఆరోపించారు. సీతారామపురంతో పాటు నాలుగుచోట్ల హత్యలు జరిగాయని, వాటిలో ప్రభుత్వ హస్తం ఉందని ఆరోపించారు.

విజయవంతం చేయండి..

పట్టణంలో ఈనెల 9వ తేదీన శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల నాయకులు, రైతులతో కలిసి నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెండు నియోజకవర్గాల్లోని రైతులు పాల్గొనాలని కోరారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బైకు ర్యాలీతో ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, ఉపాధ్యక్షులు వెంకటస్వామిగౌడ్, సోమశేఖర్, జయకృష్ణ, రవీంద్ర, విజయ్‌చౌదరి, విజయ్, కలీముల్లా, సుల్తాన్, రామచంద్రుడు, అబ్దుల్‌కలాం, గరికె రమణ, రాజు, రవి, దర్గమ్మ, షఫీవున్, అహ్మద్‌హుసేన్ పాల్గొన్నారు.

- వెలుగోడు: అన్నదాతల సమస్యలపై మొద్దునిద్ర నటిస్తున్న ప్రభుత్వంపై పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈనెల 9వ తేదీన తలపెట్టిన అన్నదాత పోరులో భాగంగా ఆత్మకూరు ఆర్డిఓ కార్యాలయం ఎదుట నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి మండల నుంచి రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలిరావాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ వెలుగోడు పట్టణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ విస్తత స్థాయి సమావేశంలో పాల్గొని అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ పథకానికి మొదటి ఏడాది ఎగనామం పెట్టారని విమర్శించారు. రెండో ఏడాది కేంద్రం ఇచ్చే నిధులు కలిపి రూ.7 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. గతంలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించి తోడుగా నిలిచామని గుర్తు చేశారు.



మాట్లాడుతున్న శిల్పా చక్రపాణిరెడ్డి

మందు పోసే అలవాటు నాది కాదు..

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఇటీవల అటవీ అధికారులపై దాడి చేసిన ఘటనలో తాను మందు పోస్తే, అంబటి రాంబాబు సోడా కలిపినట్లు ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలకు శిల్పా కౌంటర్ ఇచ్చారు. శ్రీశైలంలో తాగిన మైకంలో అటవీ అధికారులపై ఎమ్మెల్యే దాడి చేసినట్లు పేపర్లలోనే వచ్చిందని గుర్తు చేశారు. ఆ ఘటనలో న్యాయం చేస్తారని రెండు రోజులు వేచి, ఆ తరువాత నేను మీడియా ముందుకు వచ్చానని గుర్తు చేశారు. ఆ రోజు ఎమ్మెల్యే కొట్టిన దృశ్యాలు, వీడియో క్లిప్పింగ్స్‌లో స్పష్టంగా కనిపిస్తున్నా.. తాను కొట్టలేదు, ఊరికే అలా అన్నానని బుకాయించారన్నారు. మా పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డిపై కేసులు పెట్టించానని స్థాయి లేని టీడీపీ నాయకులు మాట్లాడుతున్నారని, అలా అయితే అంబాల ప్రభాకర్‌రెడ్డి తన వెంట ఎందుకు ఉంటారని ప్రశ్నించారు. పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు దేశం తిరుపం రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, మాజీ సహకార సంఘం అధ్యక్షులు వంగాల వెంకట రామిరెడ్డి, వంగాల నాగేశ్వర్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి,యేసు రత్నం, నసురుల్లా ఖాన్, బిసన్న గారి శ్రీనివాసులు, తెలుగు నాగరాజు, గోవిందు పాల్గొన్నారు.









నందికొట్కూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద అన్నదాత పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు, మిడుతూరులో.., పగిడ్యాలలో.., పాములపాడులో పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

'అన్నదాత పోరు'ను విజయవంతం చేయండి

నందికొట్కూరు: రైతన్నలకు యూరియా అందించకుండా కూటమి నేతలు, మండల వ్యవసాయ అధికారులు కుమ్మక్కై బ్లాక్ మార్కెట్‌కు తరలించి దోచుకుంటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్ అహ్మద్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద యూరియాను బ్లాక్ మార్కెట్‌కు కూటమి నేతలు తరలింపు సమస్యను ఎత్తి చూపుతూ ఈ నెల 9న ఆత్మకూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 9వ తేదీన ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతన్నకు యూరియా ఎరువుల కొరతను ఎత్తిచూపుతూ చేపట్టిన నిరసన కార్యక్రమానికి రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు కోకిల రమణారెడ్డి, మైనార్టీ నాయకులు జబ్బార్, అబుబక్కర్, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి మాధురిగౌడ్, రైతు విభాగం నాయకులు ఉపేంద్రారెడ్డి, మహేశ్వర రెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జూపాడుబంగ్లాలో అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రైతు సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టదని వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, కన్వీనర్ లోకేష్ రెడ్డి హెచ్చరించారు. మిడుతూరు మండల కేంద్రంలోని మండల కన్వీనర్ స్వగృహం వద్ద అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ నెల 9న ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ తులసిరెడ్డి, నాయకులు మల్లేశ్వరరెడ్డి, స్వామిరెడ్డి, రవికుమార్, శివనాగిరెడ్డి, హరిసర్వోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: యూరియా కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి నాగార్జునరెడ్డి, మండల కన్వీనర్ తోకల కృష్ణారెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ వై.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆదివారం జూపాడుబంగ్లాలోని నరసింహయాదవ్ ఇంటివద్ద అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 9న ఆత్మకూరులో అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తరుణ్ కుమార్‌రెడ్డి, చిన్నమల్లయ్య, నరసింహయాదవ్, నియోజకవర్గ బీసీసెల్ నాయకుడు విజయ్ కుమార్, నాగరత్నం, భాస్కరాపురం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

- పగిద్యాల: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 9న ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పగిడ్యాలలోని ఆయన స్వగృహంలో అన్నదాత పోరు పోస్టర్లును విడుదల చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, పార్టీ గ్రామ అధ్యక్షుడు రాయపు నీలం రెడ్డి, యూత్ వింగ్ ప్రెసిడెంట్ సద్దాం, ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ నాయకులు గుండెపోగు ఈశ్వరయ్య పాల్గొన్నారు.
- పాములపాడు: వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 9న తలపెట్టిన అన్నదాత పోరును విజయవంతం చేద్దామని పార్టీ మండల కన్వీనర్ నాగరాజు, కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి పిలుపునిచ్చారు.

ఆదివారం మండల కేంద్రంలో అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు హిదాయతుల్లా, షకూర్ బాష, అర్జున్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

జూపాడుబంగ్లా: క్షణికావేశానికిలోనై జీవితాలు నాశనం చేసుకోవద్దని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ మల్లికార్జున సూచించారు. ఆదివారం మండలంలోని తాటిపాడు గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలోని అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో బహిరంగ సభను నిర్వహించారు. సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ ఎలాంటి తగాదాల జోలికి వెళ్లకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించటం అలవర్చుకోవాలని సూచించారు. ఏదేని సమస్య నెలకొన్నప్పుడు ఆవేశానికిలోనై ఘర్షణలకు పాల్పడకుండా సత్వరమే పోలీసులను ఆశ్రయించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అనంతరం ఎలాంటి రికార్డుల్లేని పది బైక్‌ల యజమానులకు జరిమానాలు విధించారు.



గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ మల్లికార్జున

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

మండలంలోని తాటిపాడు గ్రామంలో గ్రామానికి చెందిన బెల్టుదుకాణం నిర్వాహకుల ఇళ్లల్లో సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది సోదాలు నిర్వహించారు. సోదాల్లో పాండురంగస్వామి, యాసిన్‌బాషా ఇళ్లల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 37క్వార్టర్ బాటిళ్లు, 3 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

తెలుగు అధ్యాపకుడికి పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న అధ్యాపకుడు ఎం. అన్వర్ హుసేన్

నందికొట్కూరు: పట్టణంలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పని చేస్తున్న ఎం.అన్వర్ హుసేన్‌కు రెండు ఉత్తమ పురస్కారాలు దక్కాయి. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్, నైస్‌యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఓల్డ్‌సిటీలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ భవన్‌లో.. ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూ సమాజ సేవలో పాల్గొంటున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఉత్తమ సేవా అవార్డులను అందజేశారు. ఇందులో అన్వర్ బాషాకు రెండు పురస్కారాలు దక్కాయి. ఒకటి విద్య, సామాజిక సేవలో జీవిత సాఫల్య పురస్కారం, మరొకటి డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం 2025 సంవత్సరానికి అందుకున్నారు. అవార్డు గ్రహీతకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగముని, రిటైర్డు ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

అక్రమ తవ్వకాలపై పోలీసుల దాడులు

- ఆరు టిప్పర్లు స్వాధీనం

మహానంది: అధికారంలో ఉన్నాం.. ఎవరేం అడగరులే అని.. అనుమతులు లేకపోయినా కొందరు కూటమి నేతలు ఎర్ర మట్టిని తరలిస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. మండలంలోని గాజులపల్లె గ్రామం సమీపంలోని అంకిరెడ్డి చెరువును అధికార పార్టీ నేతలు కొల్లగొడుతున్నారు. ఇక్కడ ఉన్న ఎర్రమట్టి వారికి ఎర్ర బంగారమైంది. రోజుకు వందల టిప్పర్లతో మట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రైల్వే పనుల కోసం అనుమతులు తీసుకున్న కాంట్రాక్టర్లు మట్టిని తరలిస్తుంటే సందట్లో సడేమియా అన్న చందంగా వారి మాటున అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తుండటం విశేషం. దీంతో పలువురు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు ఆదివారం మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది చెరువు వద్ద దాడులు నిర్వహించి అనుమతులు లేని ఆరు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైనింగ్ శాఖ అధికారులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న మట్టి టిప్పర్లు

10న అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు సీడీపీఓ పరిధిలోని శ్రీశైలం నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు ఈ నెల 10వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తామని సీడీపీఓ కోటేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బండిఆత్మకూరు మండలం నాయిని చెర్వు చెంచు గూడెం, వెలుగోడు మండలం రేగడగూడూరు గ్రామాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఆత్మకూరులోని ఆర్‌డీవో కార్యాలయ పనివేళల్లో హాజరుకావాలని సూచించారు.

కిందపడి యువకుడి మృతి

మహానంది: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా స్పృహ తప్పి పడిపోవడంతో గాయాలై కోలుకోలేక మృతి చెందిన సంఘటన ఆదివారం తమ్మడపల్లెలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వనం మధు (22) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. కొంత కాలంగా టీబీతో బాధపడుతున్న మధు ఇంటి నుంచి బయటికి వచ్చే క్రమంలో సీసీ రోడ్డుపై నడుచుకుంటూ వస్తూ స్పృహ తప్పి పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లగా.. కోలుకోలేక మృతి చెందాడని మహానంది పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి బాలసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

కోలుకోలేక యువకుడు మృతి

బండి ఆత్మకూరు : మండలంలోని భోజనం గ్రామానికి చెందిన మండపల్లి సుమంత్ (20) అనే యువకుడు పురుగు మందుతాగడంతో కుటుంబ సభ్యులు హాస్పిటల్లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడని ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. వివరాలు.. సుమంత్ పదేళ్ల వయస్సులోనే తల్లి చనిపోవడంతో తండ్రి మద్యానికి బానిసయ్యాడని, తన మంచి చెడులు చూసుకునే నాన్నమ్మ కూడా ఇటీవల అనారోగ్యంతో హాస్పిటల్‌లో చేరిందని, దీంతో మనస్తాపం చెంది గత నెల 19న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్య చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి అన్న మండపల్లి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఎరువుల దుకాణాల్లో 'విజిలెన్స్' దాడులు

- రూ. 22.39 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలు నిలిపివేత
- మరో 100 యూరియా బస్తాలు సీజ్



బుక్కాపురంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మహానంది: ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులు ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తుండటం, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండటంతో జిల్లా స్థాయిలో విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా మండలంలోని బుక్కాపురం, గాజులపల్లె గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆదివారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ వెంకటప్రసాద్, ఏఓ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మూడు దుకాణాల్లో దాడులు చేశారు. వారు మాట్లాడుతూ బైసాని ట్రేడర్స్, గఫారియా పెస్టిసైడ్స్ దుకాణాల్లో రూ. 22,39,076 విలువజేసే 79.22 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, యూరియా ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు చెప్పారు. మహానందీశ్వర ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో యూరియా బస్తా రూ. 266.50 కాగా రూ. 300కు విక్రయిస్తున్నట్లు నిర్ధారించి ఈసీ చట్టం 1955 ప్రకారం 6ఏ కింద కేసు నమోదు చేసి సీజ్ చేశామని వెల్లడించారు.

ఉపాధ్యాయ సమస్యలపై 'రణభేరి'

నందికొట్కూరు: అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నాయుడు విస్మరించడం ఎంత వరకు సమంజసమని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే. సుధాకర్, కార్యదర్శి ముర్తుజావలి ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని నంది జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయ సమస్యలపై తలపెట్టిన ప్రచార రణభేరి జాతా కార్యక్రమం కరపత్రాలను యూటీఎఫ్ నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సార్వత్రిక ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఐదు ప్రాంతాల నుంచి యూటీఎఫ్ రణభేరి జాతా నిర్వహిస్తునట్లు చెప్పారు. ఈ నెల 15న జిల్లాలో ఆళ్లగడ్డ నుంచి ప్రచార రణభేరి జాతను ప్రారంభిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, జగదీష్, మధు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల మహోత్సవం



జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామంలో మహాలయ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం జ్యోతుల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు 35 జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి చౌడేశ్వరీదేవి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, ఉపసర్పంచ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

విజ్ఞానాన్ని పెంచడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యం

నంద్యాల(వ్యవసాయం): ప్రజల్లో మూఢనమ్మకాలను పారద్రోలి విజ్ఞానాన్ని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని ఆ సంస్థ జాతీయ నాయకుడు మహమ్మద్ మియా, జిల్లా అధ్యక్షుడు దామోదర్లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మదద్ ఫౌండేషన్ కంప్యూటర్ సెంటర్‌లో జిల్లా జన విజ్ఞాన వేదిక ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం లేని జనవిజ్ఞాన వేదికను నంద్యాల జిల్లాలో బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో నూతన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. నంద్యాల జిల్లా తాత్కాలిక కమిటీ సభ్యులుగా నూర్ భాషా యాకూబ్, నాగేశ్వర్ రెడ్డి ,ఆంజనేయులు, రమేష్, హేమంత్, రమణారెడ్డి, జైపాల్, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయసాగర్, వెంకటయ్య, శంభు, అరుణను ఎన్నుకున్నట్లు తెలిపారు.